

### ఓటర్లు పెరిగారు
జిల్లాలో గడిచిన ఐదేళ్లలో 64వేల వరకు ఓటర్లు పెరిగారు. 2018లో 3,84,136 మంది ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 4,48,374కు పెరిగింది. 10లో▸



### అభివృద్ధికే.. తొలిఓటు
ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఈ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, సేవ చేసే వారికే పట్టం కడుతామంటున్నారు యువ ఓటర్లు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/21.0

### వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రివేళలో చలి ప్రభావం కనిపించనుంది.

## న్యూస్‌రీల్

### ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేయాలి



శిక్షణ తీరును పరిశీలిస్తున్న నితిన్ పాటిల్

ఇచ్చోడ: ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని ఎన్నికల పరిశీలకుడు నితిన్ పాటిల్ అన్నారు. ఎన్నికల అధికారులకు మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన వెంట రిటర్నింగ్ ఆఫీసర్ చాహత్ బాజ్‌పాయ్, ఏఆర్‌ఓ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ రామారావు ఉన్నారు.

### ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీబీ పాటిల్

సిరికొండ: ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల పర్యవేక్షణ అధికారి గణేశ్ బాపురావు పాటిల్ అన్నారు. మండలంలోని నేరడిగొండ(జి), నారాయణ్‌పూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. జాబితా ప్రకారం ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయాలని బీఎల్‌వోలకు సూచించారు.

### నేడు రైల్వే గేట్ మూసివేత

కైలాస్‌నగర్: రైల్వేట్రాక్ అత్యవసర మరమ్మతు నిర్వహణ పనులనిమిత్తం పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద గల ఎల్‌సీ గేట్ నంబర్ 29 ని ఈ నెల 23న పూర్తిగా మూసివేయనున్నట్లు రైల్వే శాఖ కిన్వాట్ విభాగం సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ప్రకటనలో తెలిపారు. వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ప్రజలు విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గమైన తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వే గేట్ నుంచి ప్రయాణించాలని ఆయన సూచించారు.

### రెండో రోజు 367 మంది ఓటు

- కొనసాగుతున్న హోమ్ పోలింగ్ ప్రక్రియ

కైలాస్‌నగర్: హోమ్ పోలింగ్ ప్రక్రియ బుధవారం రెండో రోజు కొనసాగింది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 248మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో 80 ఏళ్ల పైబడిన వృద్ధులు 197 మంది, దివ్యాంగులు 51 మంది ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో 119 ఓట్లకు గాను 109 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు.

### పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్స్

ఎదులాపురం: ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ (సైన్సెస్) కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీ వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం సీట్లకు గాను అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. సంబంధిత డిగ్రీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 25లోపు ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు కళాశాల పీజీ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్‌ను 7013268976 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

- ప్రలోభాలు దృష్టికి వస్తే సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు చేయండి
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు
- ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేక సదుపాయాలు
- కోడ్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఈవీఎంలు, ఎన్నికల అధికారుల ర్యాండమైజేషన్‌ను పూర్తి చేసి నియోజకవర్గాల వారీగా కేటాయించాం. పీవోలు, ఏపీవోలకు శిక్షణ కొనసాగుతోంది. గురువారం నుంచి బ్యాలెట్ యూనిట్ల కమిషనింగ్ ప్రక్రియ చేపడుతాం. సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగేలా వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతీ ఓటరు మొబైల్‌లో సీ–విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినట్లు తెలిస్తే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అలాగే ఓటర్లంతా స్వేచ్ఛగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పోలింగ్ శాతం పెంపు కోసం స్వీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈమేరకు బుధవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**సాక్షి:** జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య ఎంత..? ఎన్నికల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని నియమించారు?

**కలెక్టర్:** జిల్లాలో 4,48,374 మంది ఓటర్లున్నారు. వీరి కోసం 592 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 290, బోథ్ నియోజకవర్గంలో 302 ఉన్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం 4వేల మంది సిబ్బందిని నియమించాం.

**సాక్షి:** ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేపడుతున్నారు..?

**కలెక్టర్:** ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను పూర్తి చేసి నియోజకవర్గాల వారీగా కేటాయించాం. పీవో ఏపీవోలకు రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నాం. ఓపీవోలకు గురువారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. రూట్, సెక్టోరల్ అధికారులను నియమించాం. పోలింగ్‌కు అవసరమైన సామగ్రి అంతా ఇప్పటికే జిల్లాకు చేరుకుంది. దాని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేస్తున్నాం. స్ట్రాంగ్ రూంలతో పాటు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను కూడా అక్కడే చేపడుతాం.

**సాక్షి:** జిల్లాలో ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.బ్యాలెట్‌యూనిట్ల వినియోగంఎలాఉంది..?

**కలెక్టర్:** 15 మంది కంటే ఎక్కువ అభ్యర్థులు పోటీలో ఉంటే 2 బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 25 మంది అభ్యర్థులు ఉన్నందున రెండు ఏర్పాటు చేస్తున్నాం. బోథ్ నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులున్నారు. వారి గుర్తులు, వీవీ ప్యాట్స్ కమిషనింగ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆరుగురు ఇంజనీర్లు నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున ఈ ప్రక్రియను చేపడుతారు.

**సాక్షి:** పోస్టల్ బ్యాలెట్‌కు ఎంత మంది సిబ్బందిని వినియోగించనున్నారు. వారి కోసం ఎలాంటి ఏర్పాట్లు చేశారు.?

**కలెక్టర్:** జిల్లాలో 4వేల మంది సిబ్బందిని పోస్టల్ బ్యాలెట్‌కు వినియోగించనున్నాం. ట్రైనింగ్ సెంటర్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అక్కడ ఎంత మంది ఓటర్లు ఓటు వేశారనే వివరాలు రావాల్సి ఉన్నాయి. ఎవరైన ఆలస్యంగా వచ్చి ఉంటే ఓటేసేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసు ఉద్యోగుల కోసం ఇక్కడే ప్రత్యేకంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం.

**సాక్షి:** జిల్లా వ్యాప్తంగా ఎన్ని సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. వాటిలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

**కలెక్టర్:** జిల్లాలో 301 సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నాం. మరో 78 పోలింగ్ కేంద్రాల్లో బయట సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు వీలుగా ప్రత్యేక బలగాలను మోహరించనున్నాం.

**సాక్షి:** ఓటింగ్ శాతం పెంచడం కోసం ఎలాంటి చర్యలు చేపట్టారు..?

**కలెక్టర్:** ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా స్వీప్ ద్వారా బైక్, ఆటోలతో ప్రచారంతో పాటు కలెక్టరేట్‌లో సెల్ఫీ పాయింట్ ద్వారా అవగాహన కల్పించాం. వృద్ధులు, యువత, దివ్యాంగులతో ర్యాలీలు చేపట్టాం. యువత కోసం రంగోలి పోటీలు ఏర్పాటు చేశాం. గతంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన కేంద్రాల్లో ఈ సారి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు గాను పాఠశాలల విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు ఓటు సంకల్ప పత్రాలను పంపించాం.

**సాక్షి:** ప్రలోభాల కట్టడికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

**కలెక్టర్:** ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మద్యం, డబ్బు ప్రవాహం జరగకుండా కట్టడి చేస్తున్నాం. జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతున్నాం. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీమ్, వీడియోగ్రఫీ బృందాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచాం. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, కోడ్‌ను ఉల్లంఘించినా ప్రజలు నిర్భయంగా సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోపు వారిపై చర్యలు తీసుకుంటాం.

**సాక్షి:** ఇప్పటివరకు మోడల్ కోడ్ ఉల్లంఘన కేసులేమైనా నమోదయ్యాయా. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

**కలెక్టర్:** జిల్లాలో 17 మోడల్ కోడ్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. ఇందులో 16 కేసుల్లో బాధ్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశాం. ఒక కేసు తప్పని తేలడంతో దాన్ని తిరస్కరించాం.

**సాక్షి:** పోల్ చీటీల పంపిణీ ఎంత వరకు జరిగింది. ఎప్పటివరకు పూర్తవుతుంది..?

**కలెక్టర్:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఓటరుకు పోల్ చీటీలను అందించేలా గత శుక్రవారం నుంచి పంపిణీని షురూ చేశాం. 95 శాతం వరకు పూర్తయింది. ప్రస్తుతం షిఫ్టెడ్, డెలిటెడ్ వంటి వివరాలను బీఎల్‌వోల నుంచి సేకరిస్తున్నాం.

**సాక్షి:** పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు..?

**కలెక్టర్:** ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో షామియానాలు, కుర్చీలు, బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్లతో పాటు ఒక సహాయకుడిని అందుబాటులో ఉంచుతాం.

# జోష్ తగ్గిందా..!?

- నాల్గోసారి అసెంబ్లీ బరిలో పాయల్ శంకర్
- బీజేపీ ఆదిలాబాద్ అభ్యర్థికి దరిచేరని విజయం
- అనుభవాల నుంచి పాఠం నేర్వలేదనే విమర్శలు
- 'కమలం' వికాసానికి అవకాశాలున్నా అందిపుచ్చుకోలేదనే అపవాదు
- బూత్ కమిటీలు నామమాత్రమే.. పన్నా, శక్తి ప్రముఖ్‌లు కాగితాలకే..
- తమను విస్మరిస్తున్నారని సీనియర్లలో నిరుత్సాహం



బీజేపీ ఆదిలాబాద్ అభ్యర్థి పాయల్ శంకర్

సాక్షి, ఆదిలాబాద్: 'ఆదిలాబాద్ అంటేనే జోష్.. కాషాయానికి అడ్డా.. హిందుత్వానికి వేదిక.. చిన్నప్పటినుంచి చూస్తున్నాం.. ఈ మధ్యనే డల్ అయ్యారు..' ఈ మాటలన్నది స్వయాన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్. ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో కార్యకర్తలను ఉద్దేశించి ఆయన నోటివెంట వచ్చినవే. ఈ వ్యాఖ్యలకు ప్రస్తుతం పార్టీలో నెలకొన్న పరిణామాలకు పొంతన ఉండడంతోనే ఇక్కడ చెప్పాల్సి వస్తోంది. ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థిగా స్వయంగా జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ బరిలో ఉన్నారు. నాల్గోసారి ఆయన పోటీ చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు విజయం దరిచేరలేదు. అయినప్పటికి అనుభవం నుంచి ఆయన పాఠాలు నేర్వలేదనే విమర్శలు లేకపోలేదు.

**అందిపుచ్చుకోలేదనే..**

పార్టీ అభ్యున్నతికి అనేక అవకాశాలు వచ్చినప్పటికీ శంకర్ అందిపుచ్చుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీనికి కారణం లేకపోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ అభ్యర్థి సోయం బాపురావు ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు జెడ్పీటీసీ స్థానాలతోపాటు పలు ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో 8 వార్డుల్లో కౌన్సిలర్లు గెలుపొందారు. ఈ క్రమంలో పార్టీని ఆ స్థాయిలో పటిష్టపర్చలేకపోయారనే అపవాదు పార్టీలోనే ఉంది. స్వయంగా ఆయన నియోజకవర్గమైన ఆదిలాబాద్‌లోనే బూత్ కమిటీలు నామమాత్రమనే అభిప్రాయం వినిపిస్తుంది. జాతీయ పార్టీ పన్నా ప్రముఖ్, శక్తి ప్రముఖ్‌ల ఏర్పాటుపై దృష్టి సారించినా ఇక్కడ మాత్రం అవి కాగితాలకే పరిమితమనే అపవాదు లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే క్యాడర్ కరువైందని పార్టీలోనే అభిప్రాయం ఉంది.

**తగ్గిన ఓట్ల శాతం..**

పాయల్ శంకర్ 2012 ఉప ఎన్నికల బరిలో తొలిసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ 20 శాతం ఓట్లను సాధించారు. 2014లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన గణనీయంగా 30 శాతం ఓట్లను సాధించారు. అయితే 2018 ఎన్నికల్లో మరోసారి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 28 శాతం ఓట్లకు మాత్రమే పరిమితం అయ్యారు. కొంత ఓట్ల శాతం తగ్గింది. ఈ నేపథ్యంలో బీజేపీ హిందుత్వ వాదం, బీసీ నినాదం పైనే పాయల్ ఆశలు పెట్టుకొని ముందుకు కదులుతున్నారని చెప్పుకుంటున్నారు. ఇటీవల బండి సంజయ్ రోడ్ షోలో ప్రసంగిస్తూ.. మున్నూరుకాపులు పాయల్ శంకర్‌కే ఓటు వేయాలని అన్నారు. ఇందుకు కారణం లేకపోలేదు.. ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఉన్న జోగు రామన్న మున్నూరు కాపు వర్గానికి చెందినవారు. ఇక మైనార్టీల ఓట్లయితే బీజేపీకి పడే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంక్ అయిన మున్నూరుకాపుపై ఆయన దృష్టి సారించారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**సీనియర్లలో అసంతృప్తి..**

పార్టీలో తమను విస్మరిస్తున్నారనే అసంతృప్తి సీనియర్ నాయకుల్లో గతం నుంచి ఉంది. తాజాగా ఎన్నికల సమయంలోనూ అదే పరిస్థితి ఉన్నా నేరుగా బయటకు చెప్పలేకపోతున్నామని ఓ నాయకుడు వాపోవడం గమనార్హం. మధ్యలో వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే తమలాంటి వారిని చులకన చేయడం ఏవిధంగా సబబన్న ప్రశ్న వారి నుంచి ఉత్పన్నమవుతుంది.

## పోలింగ్ సజావుగా సాగేలా చర్యలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 4,48,374 మంది ఓటర్లుండగా 4,23,981 మందికి పోలింగ్ స్లిప్పులను అందించామన్నారు. మిగిలిన వారికి త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇంటి నుంచి ఓటు సేకరణ ప్రక్రియ ప్రారంభమైందని, శుక్రవారం లోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. కౌంటింగ్ నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించి వారికి శిక్షణ అందిస్తున్నామన్నారు. రాజకీయ నాయకుల ప్రచార సమావేశాలకు ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేస్తున్నామని, అలాగే కోడ్ ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బూగుప్తా, శ్యామలాదేవి, ఈడీఎం బండి రవి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ నలంద ప్రియ తదితరులు పాల్గొన్నారు.

### 9న జాతీయ లోక్ అదాలత్

ఆదిలాబాద్: డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజీమార్గంతో సత్వర న్యాయం లభిస్తుందన్నారు. ఈమేరకు బ్యాంకు, ఇన్సూరెన్స్, కార్మికశాఖ అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, ప్రమీళజైన్, తులసి దుర్గారాణి, కన్స్యూమర్ ఫోరం ప్రెసిడెంట్ జబేజ్ శామ్యూల్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, బ్యాంకు, ఇన్సూరెన్స్, కార్మికశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మంజిరిలో వైద్య శిబిరం

నార్నూర్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. మండలంలోని మంజిరిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గ్రామస్థాయిలో ఆశ, ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

## పండరీపూర్‌కు బయలుదేరిన భక్తులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

- ఆదిలాబాద్‌లో శోభాయాత్ర

ఆదిలాబాద్: పండరీపూర్ యాత్రికులు ఆసిఫాబాద్ నుంచి పాదయాత్రగా బయలుదేరి మంగళవారం ఆదిలాబాద్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో శోభాయాత్ర చేపట్టారు. శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద యాత్రను మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామితో కలిసి జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని ఏటా జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు మహారాష్ట్రలోని పండరీపూర్ యాత్రకు బయలుదేరుతారన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. భక్తులు జిల్లా కేంద్రం నుంచి రైలు ద్వారా పండరీపూర్‌కు చేరుకుంటారని వెల్లడించారు. కార్యక్రమంలో తుకారం మహారాజ్ భక్తులు తదితరులున్నారు.



యాత్రలో పాల్గొన్న భక్తులు

- తుది అంకానికి ఎన్నికల ప్రచారం
- మిగిలిన గ్రామాలు, వార్డులు చుట్టేసేలా అభ్యర్థుల ప్రణాళిక
- జాతీయ, రాష్ట్ర నేతల రాకతో సందడి

## మిగిలింది కొద్ది రోజులే!

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరువైంది. ఇక కొద్ది రోజులే మిగిలి ఉంది. ఈనెల 30న పోలింగ్ ఉండగా, 48 గంటలు ముందు ప్రచారానికి తెరపడుతోంది. అంటే.. 27వ తేది రాత్రితో ఈ ప్రక్రియ ముగియనుంది. ఈ క్రమంలో మిగిలిపోయిన మండలాల్లోని గ్రామాలు, పట్టణంలోని వార్డులను చుట్టేసేలా అభ్యర్థులు ప్రణాళిక తయారు చేసుకొని ముందుకు కదులుతున్నారు. మిగిలి ఉన్న రోజుల్లో జాతీయ, రాష్ట్ర నేతల రాకతో జిల్లాలో సందడి నెలకొననుంది.

**ప్రచారం సంపూర్ణానికి పాట్లు..**

బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారం ఇప్పటికే పూర్తయి కొన్నిచోట్ల రెండుసార్లు కూడా పర్యటించారు. ప్రధానంగా ఆ పార్టీ అభ్యర్థుల ప్రకటన రెండున్నర నెలల ముందుగానే రావడంతో వారు గ్రామ గ్రామాన ప్రచారం చేపట్టేందుకు వీలు కలిగింది. ఇక బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన ఆలస్యం కావడంతో అందుకనుగునంగానే నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీల అభ్యర్థుల పర్యటన ఇంకా అసంపూర్తిగా ఉంది. దీంతో ఈ మిగిలిపోయిన రోజుల్లో ఆ గ్రామాలు, వార్డులను చుట్టేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. దానికి అనుగుణంగా వేకువజాము నుంచే ఇంటి నుంచి బయల్దేరి ప్రచారం పూర్తి చేసుకొని అర్ధరాత్రి మళ్లీ గూటికి చేరుకునే పరిస్థితి ఉంది. మొత్తంగా ఆయా రోజుల్లో ప్రచారాన్ని సంపూర్ణం చేయాలనే సంకల్పంతో ఉన్నారు.

**ముఖ్య నేతల రాక..**

జిల్లాలో ఆయా పార్టీలకు చెందిన జాతీయ, రాష్ట్ర నేతల పర్యటన మిగిలిన రోజుల్లో జరిగే అవకాశాలు ఉన్నాయి. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈనెల 25న ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. స్థానిక డైట్ మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు.



దీనికోసం కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. మరోపక్క ఉట్నూర్, ఇచ్చోడలో 24న ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రానున్నారని ముందుగా ప్రకటించినప్పటికీ అది వాయిదా పడింది. తిరిగి ఉంటుందా.. లేదా అనే విషయంలో స్పష్టత లేదు. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ జిల్లా కేంద్రం, బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ, బోథ్‌లలో ఇప్పటికే సీఎం కేసీఆర్, రేవంత్ రెడ్డిల సభలు నిర్వహించారు. రానున్న రోజుల్లో ఇతర ముఖ్య నేతల పర్యటనలు కూడా ఉండే అవకాశం ఉంది.

## రాహుల్ సభ ఏర్పాట్ల పరిశీలన

కైలాస్‌నగర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 25న ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు కర్నాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్, పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేశ్ జాదవ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న సభకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## క్లుప్తంగా

### 'డబుల్ బెడ్రూం'లో అగ్నిప్రమాదం



దగ్ధమైన గది

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం అపార్ట్‌మెంట్‌లో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. బీ2 బ్లాక్‌లోని 104వ రూమ్‌లో సయ్యద్ షిరీన్, అఫ్సర్ దంపతులు నివాసం ఉంటున్నారు. సెల్‌ఫోన్ చార్జింగ్ ద్వారా షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా గది నిండా పొగలు కమ్ముకున్నాయి. ఆ సమయంలో గదిలో ఉన్న 8 ఏళ్ల కుమారుడు అర్సన్ ఉండడంతో తల్లిదండ్రులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కాపాడారు. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు, స్థానికులు కోరారు.

### మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామంలో బుధవారం మద్యం పట్టుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. గ్రామంలో చికెన్ సెంటర్‌లో అక్రమంగా ఉంచిన రూ.3,747 విలువ గల 6.420 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**నర్సాపూర్(జి)లో..**

నర్సాపూర్(జి): మండలంలోని కుప్టీ గ్రామంలో బుధవారం ఓ ఇంటి వద్ద అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు సీసీఎస్ సీఐ మల్లేశ్, ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. పట్టుకున్న 17 లీటర్ల మద్యం, దీని విలువ రూ.17,280 ఉంటుందన్నారు. మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### రూ.5.39 లక్షల నగదు పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.5లక్షల 39వేల నగదు తరలిస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పాండర్‌కొడకు చెందిన వ్యాపారి రమేశ్ ముత్తిల్వార్ జిల్లాకేంద్రంలో నగదు తీసుకెళ్తుండగా తిర్పెల్లి ప్రాంతంలో పట్టుకున్నామని పేర్కొన్నారు. బంగారం అమ్మిన డబ్బులని తెలిపాడని, ఆయన వద్ద తగిన ఆధారాలు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

# అభివృద్ధికే..తొలి ఓటు

- ప్రలోభాలకు లొంగవద్దు
- సేవచేసే వారికే పట్టం కట్టాలి
- యువ ఓటర్ల మనోగతం



కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఐదేళ్లకోసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఈ క్రమంలో ప్రజాసేవ చేసే నాయకుడికే పట్టం కడతాం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటేస్తామని అంటున్నారు జిల్లాలోని పలువురు యువ ఓటర్లు. అభివృద్ధికే తమ తొలి ఓటు అంటున్నారు. అభిప్రాయాలు వారి మాటల్లోనే..

జంగ్ తెలంగాణ

### సంతోషంగా ఉంది



ఇచ్చోడ: మొదటిసారి ఓటు హక్కును నమోదు చేసుకున్నాను. ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. సరైన వ్యక్తికి ఓటు వేస్తా. యువత ఓటు వినియోగించుకుని ఆదర్శంగా ఉండాలి. ఓటు వినియోగంపై నిర్లక్ష్యరాసులకు అవగాహన కల్పించాలి.

– ముండే వైష్ణవి, మన్నూర్, గుడిహత్నూర్ మండలం

### ఓటు విలువైనది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే వ్యక్తిని ఎన్నుకోవాలంటే ఓటేయాలి. పూర్తిస్థాయిలో ఓటు వినియోగించుకోవాలి.

– బియ్యల అపర్ణ, సిరికొండ

### నిర్భయంగా ఓటేయాలి



ఓటు వినియోగించుకుని ఉత్తమ నాయకులను ఎన్నుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దు. నిజాయితీతో నిర్భయంగా తమ ఓటు వినియోగించుకోవాలి.

– నిమ్మల విఠల్‌రెడ్డి, ఇచ్చోడ

### అభివృద్ధి చేసేవారికే ఓటు



అభివృద్ధి చేసే నాయకులకే పట్టం కట్టాలి. వారిని ఎన్నుకోవడానికి ఓటు వేయడం మంచి అవకాశం. పవిత్ర గ్రంథమైన ఖురాన్ లాగా ఓటును భావించాలి. ఎలాంటి భయం లేకుండా ఓటేయాలి.

– ఇర్ఫాన్, కేశవపట్నం, ఇచ్చోడ మండలం

### పథకాలు అందించేవారికే ఓటు



కైలాస్‌నగర్: ప్రజలకు సంక్షేమ పథకాలు, ప్రజల అవసరాలు గుర్తించి తీర్చగలిగే అభ్యర్థినే ఓటు వేసి ఎన్నుకోవాలి. బరిలో నిలిచిన వారిలో సమర్థుడైన నాయకుడు ఎవరనేది ఆలోచించి విచక్షణతో నిజాయితీతో ఓటేయాలి. ప్రలోభాలకు గురై ఓటు వేస్తే ఐదేళ్ల పాటు అవస్థలు పడక తప్పదు.

– ఎం.స్వాతి

### భవిష్యత్తు మార్చే ఆయుధం..



కైలాస్‌నగర్:మనం వేసే ఓటు మన భవిష్యత్తును మార్చే వజ్రాయుధం లాంటిది. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఆలోచించి సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. ప్రజలకు ఎవరు మంచి చేయగలుగుతారో వారినే పట్టం కట్టాలి.

– కొప్పుల జగదీశ్

### మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



ఆదిలాబాద్: నాయకులనేవారు ఓటర్లకు మార్గదర్శకంగా ఉండాలి. నిజాయితీతో వ్యవహరించాలి. నాయకుల ప్రలోభాలకు యువత దూరంగా ఉండి, మంచి చేసేవారిని ఎన్నుకోవాలి. తమ ఓటును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి.– గాజిరి కల్యాణి, పిట్టల్‌వాడ, ఆదిలాబాద్

### తొలి ఓటు వేస్తా



ఇంద్రవెల్లి: తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. అభ్యర్థి గుణగణాలు తెలుసుకుని ఓటు వేస్తా. అభివృద్ధి చేసేవారినే యువత ఎన్నుకోవాలి. ఓటు వినియోగంపై తోటి మిత్రులకు అవగాహన కల్పిస్తా.

– షేక్ అమాన్, ఇంద్రవెల్లి, డిగ్రీ విద్యార్థి

### ఓటు విలువైంది



కైలాస్‌నగర్:ఓటును వజ్రాయుధంగా భావిస్తాను. మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఉపయోగిస్తాను. ఓటును దుర్వినియోగం చేయవద్దు. ఓటు చాలా విలువైంది. ప్రజాస్వామ్యంలో ఓటుకు చాలా ప్రాధాన్యత ఉంది. సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవడమే ఓటు ప్రధాన ఉద్దేశం.

– ఎం.రాజేందర్

### సేవచేసే పార్టీకే నా ఓటు



కొత్తగా ఓటు హక్కు వచ్చింది. పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాను. ప్రజలకు సేవ చేసే పార్టీకే ఓటు వేస్తాను. ఓటు ఉన్న ప్రతిఒక్కరు బాధ్యతగా వినియోగించుకోవాలి. ఎవరు నోటాకు ఓటు వేయవద్దు. చదువుకున్న వారు చదువురాని వారికి ఓటు విలువను తెలియజేసి దాన్ని వినియోగించేలా చూడాలి.

– ఎస్.మనీషా

### ఓటు బాధ్యతగా భావించాలి



ఓటు వినియోగించడం బాధ్యతగా భావించాలి. ఓటు వేయడం ద్వారానే సరైన నాయకుడిని ఎన్నుకోగలుగుతాం. అభ్యర్థి గెలుపునకు ఓటు కూడా కీలకం కానుంది. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలి. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా మనకు నచ్చిన వ్యక్తికి ఓటేయాలి.

– పి.అంజలి

### ఉపాధి కల్పించాలి



ఆదిలాబాద్: దేశంలో యువత సంఖ్య అధికంగా ఉంటుంది. వారి భవిష్యత్ పట్టించుకోవాల్సిన బాధ్యత పాలకులు, ప్రజాప్రతినిధులపై ఉంది. వారికి సరైన ఉద్యోగ అవకాశాలు, ఉపాధి కల్పించాలి. సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు వినియోగించుకోవాలి.

– వంశీ, కోలిపురా, ఆదిలాబాద్

### మార్పు అవసరం



కడెం: ప్రజలు, ఓటర్లలో మార్పు అవసరం. విద్య, వైద్యం అందించే పాలకులు, నాయకులను ఎన్నుకోవాలి. మంచి నాయకుడిని ఎన్నుకుంటారని ఆశిస్తున్నా. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉంది.

– అంథోని గ్లోరియాఆకర్షిత, కడెం

### అందుబాటులో ఉండాలి



ఓటు అనేది వజ్రాయుధం. సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలి. సేవచేసేవారికి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ఓటేయాలి. – ఆకిరెడ్డి భాను, కొండుకూర్

# క్రీడలతో మానసికోల్లాసం





బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్

- ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్
- ముగిసిన ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

ఆదిలాబాద్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. నిరంతరం సాధన చేస్తే క్రీడాకారులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. కళాశాల విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, వీరస్వామి, సుజయ్, రాజన్న, సురేష్, పరిపాలన అధికారి రాజేష్, వ్యాయామ అధ్యాపకుడు కుమారస్వామి, అధ్యాపకులు ప్రవీణ్, గజానంద్‌రావు, రామేశ్వర్ రెడ్డి, సుధాకర్, రవికుమార్, నీల్‌కమల్, విజయలక్ష్మి, క్రాంతికుమార్, జ్యోత్స్నరాణి, యశశ్రీ, సంగీత, హేమలత, మురళీకృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌గా బెల్లంపల్లి పాలిటెక్నిక్, ఆదిలాబాద్ పాలిటెక్నిక్ ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచాయి. బాలుర విభాగంలో వ్యక్తిగత, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ఉట్నూర్ పాలిటెక్నిక్ కళాశాలలు గెలుచుకున్నాయి.


# ఓటర్లు పెరిగారు..

- ఐదేళ్లలో 64వేలకు పైగానే..
- 2018లో 3,84,136
- 2023లో 4,48,374
- పురుషులు 28,775
- మహిళలు 35,517

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తోంది. ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తును ముమ్మరం చేసింది. వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా తగు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీన ఎన్నికల సంఘం అనుబంధ ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. దీని ప్రకారంగా గత ఐదేళ్లలో ఆదిలాబాద్ జిల్లాలో 64,238 మంది ఓటర్లు అధికంగా పెరిగారు. పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వీరందరూ ఓటు వేసేలా ఇప్పటికే పోల్ చీటీలను అందజేసిన అధికారులు ఓటు హక్కును వినియోగించుకునేలా బీఎల్‌వోల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

**మహిళలే అధికం..**

2018తో పోల్చితే జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగానే పెరిగింది. పురుష ఓటర్లు 39,187 మంది పెరుగగా, బోథ్ నియోజకవర్గంలో 25051 మంది మహిళ ఓటర్లుగా కొత్తగా నమోదయ్యారు. కొత్తగా నమోదైన ఓటర్లలో పురుషులతో పోల్చితే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 17,760 మంది పెరగగా, మహిళలు 21,468 మంది కొత్తగా నమోదయ్యారు. అలాగే బోథ్ నియోజకవర్గంలో పురుషులు 11,015 మంది



పెరిగితే, మహిళలు 14,049 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. రెండు నియోజకవర్గాలతో పోల్చితే ఓటర్ల పెంపు ఆదిలాబాద్ నియోజకవర్గంలోనే ఎక్కువగా కనిపిస్తోంది.

**ఆదిలాబాద్‌అర్బన్‌లో అధికం..**

పెరిగిన ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే.. ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఎక్కువగా కనిపిస్తోంది. 2018 కంటే ఈ మండలంలో కొత్తగా 19,850 మంది ఓటు హక్కును పొందారు. అత్యల్పంగా బోథ్ నియోజకవర్గంలోని సిరికొండ మండలంలో 900మంది ఓటర్లుగా నమోదయ్యారు. గతంలో 6020 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 6920 మంది ఉన్నారు. ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం పలుమార్లు అవకాశం కల్పించడం, అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేయడంతో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓటర్ల సంఖ్యను పెంచగలిగిన అధికారులు వారందరినీ పోలింగ్ కేంద్రాలకు ఏ మేరకు రప్పించగలుగుతారనే దానిపైనే పోలింగ్ శాతం ముడిపడి ఉంది.

ఐదేళ్లలో పెరిగిన ఓట్లు..

ఆదిలాబాద్ నియోజకవర్గంలో..

| నియోజకవర్గం | పెరిగిన ఓటర్లు |
|---|---|
| ఆదిలాబాద్ | 2263 |
| జైనథ్ | 4081 |
| ఆదిలాబాద్‌రూరల్ | 5221 |
| మావల | 7772 |
| ఆదిలాబాద్‌అర్బన్ | 19850 |

బోథ్ నియోజకవర్గంలో..

| నియోజకవర్గం | పెరిగిన ఓటర్లు |
|---|---|
| భీంపూర్ | 2065 |
| తాంసి | 980 |
| తలమడుగు | 2275 |
| గుడిహత్నూర్ | 2843 |
| ఇచ్చోడ | 5305 |
| సిరికొండ | 900 |
| బజార్‌హత్నూర్ | 2777 |
| బోథ్ | 4644 |
| నేరడిగొండ | 3257 |

## అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్‌రూరల్ ఏఎస్సై ఫతేసింగ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని శ్రీరాంకాలనీకి చెందిన కౌలు రైతు పడాల నవీన్ (43) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొన్నేళ్లుగా ఖానాపూర్ శివారులో నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఈఏడాదితోపాటు గతేడాది వేసిన పంటలు దిగుబడి రాలేదు. చేసిన అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపం చెంది పొలంలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

### జీవితంపై విరక్తితో వ్యక్తి..



సంతోష్(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని బోయి గల్లికి చెందిన పెయింటర్ సంతోష్(56) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై సందీప్ తెలిపారు. స్థానికంగా పెయింటర్‌గా పని చేస్తుండగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమై ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### మద్యం మత్తులో ఒకరు

భైంసారూరల్: మద్యం మత్తులో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం..మండలంలోని దేగాం గ్రామానికి చెందిన గంగాధరోళ్ల విఠల్ (40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె ఉంది.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోథ్ మండలంలోని సాయినగర్‌కు చెందిన జి.భూషణ్‌కుమార్ బైక్‌పై ఆదిలాబాద్ నుంచి బోథ్‌కు వెళ్తున్నాడు. జాతీయ రహదారి 44పై వేగంగా వచ్చి స్థానిక డీఆర్‌డిపో కమాన్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అప్పటికే అక్కడ ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు గమనించి క్షతగాత్రుడిని అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

**గుర్తుతెలియని వ్యక్తి మృతి**

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ శివారులో నేషనల్ హైవేపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి (30) మృతిచెందినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుడు బ్లాక కలర్ జీన్స్, గ్రీన్ కలర్ టీషర్ట్ వేసుకున్నాడు. ఇతని సమాచారం తెలిసినవారు సెల్ 8712659515 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### గంజాయి మొక్కలు ధ్వంసం

బజార్‌హత్నూర్: మండలంలోని ఉమార్డ(జి) గ్రామంలోని పత్తి చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు సీఐ భీమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మడావి మనోహర్ చేనును సమీప బంధువు కాత్లే శంభు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాడు. దాంతోపాటు గంజాయి సాగు చేస్తున్నారని సమాచారంతో బుధవారం దాడులు చేసి 25 గంజాయి మొక్కలను ధ్వంసం చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో సీసీఎస్ సీఐ సాయినాథ్, ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

## ఆదివాసీ కళాకారుడికి ప్రతిభా పురస్కారం





పురస్కారం అందుకుంటున్న కాత్లె శ్రీధర్

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ కళాకారుడు కాత్లె శ్రీధర్‌కు ప్రతిభా పురస్కారం లభించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సింగిడి సాంస్కృతిక సంస్థ వివిధ రంగాల్లో రాణిస్తున్న కళాకారులకు వీటిని అందజేసింది. శ్రీధర్‌కు సంస్థ డైరెక్టర్ డీఆర్‌కే విశ్వకర్మ ఈ పురస్కారాన్ని అందజేశారు.

### 'టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం'

ఎదులాపురం: రాష్ట్రంలో అధికసంఖ్యలో ఉన్న మున్నూరు కాపులకు టికెట్ల కేటాయింపులో బీఆర్ఎస్ ప్రాధాన్యం కల్పించిందని రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఒకే ఒక అభ్యర్థి జోగు రామన్నకు కులస్తులు ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కేవలం నాలుగు సీట్లు, బీజేపీ ఆరు సీట్లు ఇచ్చిందని అన్నారు. అనంతరం దేవయ్యను సన్మానించారు. సమావేశంలో కాళ్ల విట్టల్, సంతోష్, శంకర్, కొండ గంగాధర్, శశికాంత్, సాయిని రవికుమార్, బొల్లు దేవిదాస్, కందుల రవీందర్, బారే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



### తాపీ పట్టి..ఓట్లు అడిగి

బీఆర్ఎస్ ఆదిలాబాద్ అభ్యర్థి జోగు రామన్న ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో బుధవారం పర్యటించారు. ఓ ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండగా తాపీ పట్టి గోడకు గిలావ చేశారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని, అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



### టమాట అమ్ముతూ ప్రచారం

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతలో టమాట అమ్ముతూ..ఓట్లు అడిగారు. డప్పుకొడుతూ తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ నగేష్, ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ష్యూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గంటలు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

Finance Services

■సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సిబిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-1200958]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462